క్లుప్తంగా

అమ్మవారికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం అమ్మవారికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తు లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

అమృత కలశ యాత్రకు పయనం


అమృతకలశంతో ఢిల్లీకి వెళుతున్న వేపాడ బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్

వేపాడ: నాదేశం–నామట్టి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహిస్తున్న అమృత కలశయాత్రకు మండల బీజేపీ అధ్య క్షుడు గోకాడ మహేష్, ఆ పార్టీ కార్యకర్తలు పలువురు ఆదివారం ఉదయం పయనమయ్యారు. నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశాలతో తీసుకు వెళ్తున్నట్టు మహేష్ చెప్పారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమ వారం నిర్వహించనున్న యాత్రలో వీరు పాల్గొననున్నారు.

దాతల సహకారంతో ఆలయానికి ప్రహరీ నిర్మాణం


ప్రహరీని ప్రారంభిస్తున్న గ్రామపెద్దలతో యువజన సంఘం సభ్యులు

కొత్తవలస: మండలంలోని పాతసుంకర పాలెం గ్రామంలో బంగారమ్మ తల్లి ఆలయానికి ప్రహరీ నిర్మాణాన్ని ఆగ్రామానికి చెందిన శ్రీసిద్ధి వినాయక యువజన సేవా సంఘం సభ్యులు దాతల సహకారంతో నిర్మించారు. ఈ ప్రహరీని గ్రామ పెద్దలు ఆదివారం ప్రారంభించారు. యువజన సంఘం సభ్యులు కొంత మొత్తం విరాళాలు వేసుకుని మిగిలిన సొమ్మును దాతల నుంచి సేకరించారు.రూ.2.50 లక్షలతో ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశారు. యువజన సంఘం సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

పారిశుద్ధ్య పనులు


వీధి కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామ న్యూకాలనీలో పంచాయతీ అధికారులు ఆదివారం పారిశుద్ధ్యపనులు చేయించారు. అన్ని వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు.

పైడితల్లికి జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు


పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

విజయనగరం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వేదమంత్రాలతో వీరికి స్వాగతం పలికారు. అమ్మవారికి జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులు, అల్లుడు ప్రదీప్‌నాయుడు, కుమార్తె సిరి సహస్ర, కుమారుడు సాయి మోహిత్ పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు వీరిని ఆశీర్వదించి ప్రత్యేక పూజలు చేశారు.

పేదల సొంతింటి కల సాకారం

- గజపతినగరం మండలంలోని జగనన్న లేఅవుట్లలో జోరుగా ఇళ్ల నిర్మాణం


పురిటిపెంటలోని జగనన్న లేఅవుట్‌లో పూర్తయిన ఇళ్ల నిర్మాణం


ఎస్.జి.ఆర్.పురం లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం

గజపతినగరం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా అర్హులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గృహాలు మంజూరు చేస్తోంది. ఇళ్ల నిర్మాణానికి సొంత స్థలం లేని వారి కోసం జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి పట్టాలు అందజేస్తోంది. గజపతినగరం మండలంలోని 23 గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను ప్రభుత్వం ఏర్పా టు చేసింది. ఈ లేఅవుట్లలో ఆయా గ్రామాల్లో 747 మంది అర్హులకు పట్టాలు అందజేసి, గృహాలు మంజూరు చేశారు. లేఅవుట్లను అభివృద్ధి చేసి ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పించడంతో లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. 247 నిర్మాణా లు శతశాతం పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాల దశ ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రభు త్వం బిల్లులు చెల్లిస్తోంది. నిర్మాణ పనులను గృహ నిర్మాణశాఖ, రెవెన్యూ అధికారులు హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా వారానికి ఒకసారి పర్యవేక్షిస్తున్నారు.

సంతోషంగా ఉంది



సొంత ఇల్లు లేక ఎన్నో ఏళ్లుగా నానా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. సొంతింటి కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎస్.కుమారి, లబ్ధిదారు, పురిటిపెంట

సహాయసహకారాలు అందిస్తున్నాం



మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాము. ఇల్లు లేని ప్రతీ పేదవాడికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తోంది. స్థలం లేనివారికి ప్రభుత్వమే స్థలం ఇస్తోంది. గృహ లబ్ధి దారులకు ఇళ్ల నిర్మాణ విషయంలో ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నాం.

– ఎం.అరుణకుమారి, తహసీల్దార్

రమణకు శ్రీ అరబిందో అవార్డు


అవార్డు అందుకుంటున్న రెడ్డి రమణ

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణకు ప్రతిష్టాత్మక ప్రముఖ తత్వశాస్త్రవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ అరబిందో అవార్డు లభించింది. శనివారం సాయంత్రం ఈ అవార్డును న్యూ ఢిల్లీలోని యోగిశ్వరి దేవీ దయాల్ మందిర్‌లో రమణ అందుకున్నారు. శ్రీ అరబిందో 150వ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీకి చెందిన ఎటర్నల్ హిందూ ఫౌండేషన్ ఈ అవార్డులు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల నుంచి సామాజిక చైతన్య కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్తలను ఎంపిక చేయగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి చీపురుపల్లికి చెందిన రెడ్డి రమణ ఉన్నారు. ప్రముఖ యోగాచార్యులు హర్జీత్ సింగ్, రెజ్లింగ్ క్రీడాకారిణి బబితా ఫోగట్ తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు రమణ ఢిల్లీ నుంచి స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు.

రూ.90 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ


మరుపల్లి నుంచి పెదకాద గ్రామానికి వేసిన తారు రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామ తారు రోడ్డు పునరుద్ధరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. గతంలో రోడ్డు గోతులమయం అవ్వడంతో రాక పోకలు సాగించేందుకు గ్రామస్తులు అవస్థలు పడాల్సివచ్చేది. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు గ్రామస్తులు సమస్యను వివరించారు. ఎమ్మె ల్యే స్పందిస్తూ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు ఏఎంసీ నిధులు రూ. 90 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో మరుపల్లి నుంచి పెదకాద గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల మేర తారురోడ్డు పునరుద్ధరణ పనులు ఇటీవల ప్రారంభించి పూర్తి చేశామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. రోడ్డు పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు చుట్టూ తిరిగా పరిష్కారం కాని తమ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు చెప్పగానే పరిష్కరించారని సర్పంచ్ గుజ్జ మంగ, ఎంపీటీసీ నాగిరెడ్డి సత్యం, ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ సామిరెడ్డి కుమార్‌నాయుడు చెబుతూ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సకల కళల సమాహారం..

- వెల్లివిరిసిన కళా రూపాలు, నృత్య ప్రదర్శనలు
- ఆద్యంతం ఆసక్తి గొలిపే విన్యాసాలు
- రక్తి కట్టించిన ఏకపాత్రాభినయాలు


గొల్లపల్లి సత్యారావు పులివేషధారులు


థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు


ఆనందగజపతి కళాక్షేత్రం ఆవరణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహం వద్ద నృత్యబృందం

విజయనగరం టౌన్: విజయనగర ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం విజయనగర ఉత్సవాలకు పెద్దపీట వేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అంగరంగ వైభవంగా ఉత్సవాల నిర్వహణ చేపట్టింది. ఎటుచూసినా కళారూపాలను ప్రదర్శిస్తూ కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. నాలుగు వైపులా సాంస్కృతిక కార్యక్రమాలతో విజయనగరం విరాజిల్లుతోంది. ఓ వైపు పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలు.. మరోవైపు విజయనగర వైభవం ఉట్టిపడేలా విజయనగర ఉత్సవాలతో విద్యలనగరం శోభాయమానంగా వెలుగుతోంది.

సంగీత సౌరభాలు విరాజిల్లిన ఆనందగజపతి కళాక్షేత్రం

కూచిపూడి, భరతనాట్యం, లలిత సంగీతం, వీణ, డోలు, నాదస్వరం, జానపద గీతాలు, శాస్త్రీయ నృత్యాలకు వేదికగా ఆనందగజపతి కళాక్షేత్రం అలరాడింది. బి.సాయికృప, సాయి మానస బృందం శాస్త్రీయ సంగీతం.. సామవేదుల సత్యలత జానపదగీతాలు.. నర్తనశాల అకాడమీ డాక్టర్ భేరి రాధికారాణి నృత్యబృందం.. శ్రీ ప్రసన్న నృత్య కళానికేతన్ ఇబ్రహీమ్ ఖాన్ బృందం, సూర్యతేజ డ్యాన్స్ అకాడమీ ఎం.సౌభాగ్యలక్ష్మి బృందం, శ్రీ సూర్యా అకాడమీ టీవీ రామకశ్యప్ బృందం చేసిన సంప్రదాయ కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆహూతులను కట్టిపడేశాయి. మధ్యాహ్నం కె.పెంటయ్యనాయుడు బృందం ఆలపించిన భక్తిసంగీతం, జి.రాధాకుమారి బృందం లలిత సంగీతం, పి.తిరుపతి, శివకుమార్ జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. ఎస్.సంపత్ బృందం చేసిన శాస్త్రీయ సంగీతం.. వాసా సాయిజానకీ బృందం వీణాకచేరీ.. వెంపడాపు అప్పలస్వామి బృందం ఆలపించిన మృదంగ లయ విన్యాసం.. ఎన్.గోపాలరావు నాదస్వర లయవిన్యాసం ఆద్యంతం ఆనందింపజేశాయి. ఎ.శ్రీనివాసుల బృందం డోలు లయ విన్యాసం.. కె.విద్యాసాగర్ బృందం లలిత సంగీతం.. ఐ.మెహర్‌లత భక్తి సంగీతం.. చాగంటి రాజ్యలక్ష్మి బృందం శాస్త్రీయ సంగీతం.. సీహెచ్.రామచంద్రశేఖర్ బృందం ఆలపించిన భక్తి సంగీతం.. త్యాగరాజ సంగీత, నృత్య కళానికేతన్ ఎం.లక్ష్మీ రామదాసు బృందం శాస్త్రీయ సంగీతం చూపరులను కట్టిపడేశాయి. చివరిగా అమృతవర్షిణి టి.సౌమ్య బృందం చేసిన క్లాసికల్ డ్యాన్స్.. డాక్టర్ మండపాక రవి మృదంగ లయ విన్యాసం.. ఎం.బాలసరస్వతి వీణ కచేరి ఆహూతుల మన్ననలు పొందాయి. కార్యక్రమాలను జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి పర్యవేక్షించారు.

దుమ్మురేపిన జానపదకళాకారులు

స్థానిక లయన్స్ క్లబ్ వేదికగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జానపద కళాకారులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. గొల్లపల్లి సత్యారావు బృందం పులివేషాలు, కర్రసాము, కత్తిసాము ఆద్యంతం ఆహూతుల మన్ననలు పొందాయి. పూసపాటిరేగ సాయిగ్రూప్, విజయనగరం జాహ్నవి గ్రూప్, గజపతినగరం సంధ్య గ్రూప్ వేసిన జానపద నృత్యాలకు ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. తిరుపతి గ్రూప్ జానపద గీతాల ఫోక్ ఆర్కెస్ట్రా, రేలా రే రేలా.. జామి రామా గ్రూప్ తప్పెటగుళ్లు.. పాలకొండ సవర కమల గ్రూప్, వియ్యంపేట కె.ధనలక్ష్మి గ్రూప్ థింసా నృత్యం.. పాలకొండ సవర మాధవి గ్రూప్, కె.ధనలక్ష్మి గ్రూప్‌ల గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మధ్యాహ్నం సీహెచ్ చిన్నరెడ్డి, ఎ.లక్ష్మనాయుడుల మహిళల కోలాటం, జముకుల కథ, నృత్యరూపకాలు, చెక్క భజనలు, శివభాగవతం అలరించాయి. కార్యక్రమాలను గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌వీకే దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.యశోధనరావు, సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

గురజాడ కళాభారతి వేదికగా 28 మంది కళాకారులతో నిర్వహించిన నాటిక ప్రదర్శనలు అలరించాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించిన నాటికల్లో విజయనగరానికి చెందిన నాటకశాల నటసేవా సమాజం నిర్వహించిన ఆఖరి ఉత్తరం ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంది. ఈపు అప్పలస్వామి స్మారక సాంస్కృతిక సేవా సమాజం నిర్వహించిన ఒక రాక్షసుడి కథ, దండుమారమ్మ ఆర్ట్స్ నిర్వహించిన రక్తసంబంధాలు నాటిక చూపరులను ఆలోచింపజేశాయి. అదేవిధంగా విజయలక్ష్మీ బృందం చేసిన జననీ జయహే నాటిక, కణపాక శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన రాళ్లు – రత్నాలు నాటిక మంచి సందేశాలనిచ్చాయి. రౌతు అప్పలనాయుడు కల్చరల్ ట్రస్ట్ వారి కొండగాలి నాటిక అబ్బురపరిచింది.

అలరించిన అవధానాలు

కవులు తమ సాహితీ శంఖారావాన్ని పూరించారు. ఒకరికొకరు పోటీగా అవధాన ప్రక్రియలో పాల్గొని అందరినీ సంభ్రమాశ్చర్యానికి గురిచేశారు. శతాధిక కవి సమ్మేళనం నిర్వహణ బాధ్యతలను చివుకుల శ్రీలక్ష్మి, చీకటి దివాకర్ చేపట్టారు. లబ్ధప్రతిష్ఠులైన శతాధిక కవులు, కవయిత్రులు, పండితులు ఆలపించిన స్వీయ కవితాగానం, పద్యాలాపన చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన సాహిత్యగోష్టిని ఎన్‌కే .బాబు, డాక్టర్ జక్కు రామకృష్ణ పర్యవేక్షించారు. పద్య సాహిత్యంలో కొట్టు బాబురావు.. చరిత్ర, సాహిత్యంలో గార రంగనాథం.. ప్రవాస తెలుగు సాహిత్యంలో మంగిపూడి రాధిక.. ఆకాశవాణి సాహిత్య ప్రోత్సాహంలో బేత రామ సూర్యప్రకాశరావు.. ప్రచురణ రంగం ఇష్టాలు, కష్టాలను దుప్పల రవికుమార్.. సాహిత్య ప్రక్రియలు పాఠకాధారణను వి.వెంకటరావు.. జాషువా సాహిత్యాన్ని దేవరపల్లి రామయ్య.. సాహిత్యంలో గ్రామీణం డాక్టర్ అల్లి మోహనరావు.. జానపద సాహిత్యంలో బద్రి కూర్మారావు తమ ప్రతిభను చూపారు.

క్రీడా మైదానాన్ని తలపించేలా...


మైదానంలా కనిపిస్తున్న కోనేరు

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేట గ్రామంలోని కోనేరు క్రికెట్ మైదానాన్ని తలపిస్తోంది.అంతా గుర్రపు డెక్క, నాచుతో పచ్చగా కనిపిస్తున్న కోనేరును అటువైపు నుంచి ప్రయాణిస్తున్న పలు గ్రామాల ప్రయాణికులు ఆసక్తిగా చూస్తున్నారు.

నేడు కొత్తపాలెంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

బొండపల్లి: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపాలెం గ్రామ సచివాలయం వద్ద సోమ వారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు శిబిరానికి వచ్చి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు పోరలిలో ..

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు సేవలందిస్తారని, సచివాలయ పరిధి గ్రామాల ప్రజలు సేవలను సద్వినియోగించుకోవాలని సూచించారు.

ప్రత్యేక బస్ సర్వీసులు

శృంగవరపుకోట: విజయనగరం పైడితల్లమ్మ వారి ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం ఎస్.కోట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్(డీఎం) కె.రమేష్ చెప్పారు. ప్రత్యేక బస్సులు ఆదివారమే అం దుబాటులోకి వచ్చాయి. జామి, ధర్మవరం, కొత్తవలస మీదుగా విజయనగరం సర్వీసులు ఏర్పాటు చేశామ ని డీఎం చెప్పారు. ఈనెల 30వ తేదీ నుంచి విశాఖ వెళ్లేందుకు ఉదయం 4గంటలకు ఆల్ట్రా డీలక్స్ సర్వీ సు, అలాగే విశాఖ నుంచి ఎస్.కోట మీదుగా అరుకు వచ్చేందుకు ఉదయం 4.45 గంటలకు విశాఖ డిపోలో ఒక సర్వీసు బయల్దేరుతుందని ప్రయాణికులు ఈ సేవలను వినియోగించు కోవాలని ఆయన కోరారు.

ఈ-క్రాప్ జాబితాను సరిచూసుకోండి

బొండపల్లి: మండలంలోని అన్ని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ వివరాల జాబితాను ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు ఆదివారం తెలిపారు. ఆజాబి తాల్లో తమ వివరాలు సరిగా ఉన్నాయో లేదో రైతులు సరిచూసుకోవాలని సూచించారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీలోగా సంబంధిత వీఏఏ దృష్టికి తీసుకువెళ్లి సరిచేయించుకోవాలని చెప్పారు. అభ్యంతరాలను సరిచేసిన అనంతరం తుది జాబితాను రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాల రవాణాకు చెక్

విజయనగరం క్రైమ్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా 30న తొలేళ్లు, 31న సిరిమానోత్సవం పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలోనికి మత్తు పదార్థాలు రానీయకుండా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు ప్రత్యేక చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పట్టణంలోనికి మద్యం, సారా, గంజాయి, తదితర నిషేధిత సరుకులు రాకుండా వై జంక్షన్, అయ్యన్నపేట జంక్షన్, జేఎన్‌టీయూ జంక్షన్, జమ్ము జంక్షన్, సారిపల్లి జంక్షన్‌ల వద్ద చెక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. అదేవిధంగా వన్‌టౌన్, రూరల్ సీఐల ఆధ్వర్యంలో రెండు మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే 94413 69536 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత



చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన భువనేశ్వర్- ముంబై సూపర్ ఫాస్ట్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు బస్సు ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు వంశీకృష్ణ


కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

చీపురుపల్లి: జిల్లాలో రైలు ప్రమాదం సంభవించిన నేపథ్యంలో భువనేశ్వర్ నుంచి ముంబై వెళుతున్న కోణార్క్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి నిలిపివేశారు. జిల్లాలోని అలమండ వద్ద విశాఖ –పలాస ప్రత్యేక ప్యాసింజర్ రైలు, రాయగడ –విశాఖ ప్యాసింజర్ రైలు మధ్య జరిగిన ప్రమాదం కారణంగా కోణార్క్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రాత్రి 9 గంటల సమయంలో చీపురుపల్లిలో నిలిపివేశారు. అర్ధరాత్రి వరకు సాంకేతిక అనుమతి లభించకపోవడంతో రైలు ఇక్కడే నిలిచిపోయింది. ఆ రైలులో పలు ప్రాంతాలకు ప్రయాణిస్తున్న ప్రయాణికులు అధిక సంఖ్యలో రైలు దిగి వారి గమ్యస్థానాలు చేరేందుకు రోడ్లపైకి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్... ఆయన తనయుడు వంశీకృష్ణ, జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ తాడేల ఉమ, టెలికాం బోర్డు మెంబర్ ఇప్పలి తిరుమలలను రైల్వే స్టేషన్‌కు పంపించి ప్రయాణికులకు బస్సు ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఎంపీ చంద్రశేఖర్ తిరుపతిలో ఉండడంతో ఫోన్లో ఆర్టీసీ రీజినల్ చైర్మన్‌తో మాట్లాడి ప్రయాణికుల కోసం బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.